క్లుప్తంగా

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ

నార్పల: మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో కుళ్లాయిస్వామి మండల సమాఖ్య 19వ వార్షికోత్సవ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. పథకాల నగదు కూడా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంత చేస్తున్న జగనన్నను టీడీపీ, జనసేన నాయకులు విమర్శించడం తగదన్నారు. అనంతరం మండల సమాఖ్యకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఫర్వీన్, కార్యదర్శిగా నారమ్మ, కోశాధికారిగా రామలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, ఏపీఎం తిప్పమ్మ, సీడీపీఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి


స్టడీ మెటీరియల్ చూపుతున్న విద్యార్థులతో రోటరీ క్లబ్ సభ్యులు

గుంతకల్లు రూరల్: విద్యావంతుల ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ సూచించారు. రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మొలకలపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ ప్రదీప్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం

పెద్దవడుగూరు: మేడిమాకులపల్లికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి ఇటీవల అప్పుల బాధ తాళలేక పొలంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రాజశేఖర్‌రెడ్డి తోటి మిత్రులు (10వ తరగతి 2004–05 బ్యాచ్ విద్యార్థులు) సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చందాల వేసుకుని సేకరించిన రూ.25 వేల ఆర్థికసాయాన్ని మృతుడి తల్లి తోట కళావతికి అందజేశారు. రాజశేఖర్‌రెడ్డి మరణం జీర్ణించు కోలేకపోతున్నామని, స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తామని మిత్రులు తెలిపారు.

వరుణుడు కరుణించాలని పూజలు


వర్షాలు కురవాలని ఎద్దు శెగనం నిర్వహిస్తున్న గ్రామస్తులు

పెద్దవడుగూరు: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో గ్రామ పెద్దలు ఎద్దుశెగనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షం కోసం పారాయణం చదువుతూ వృషభానికి ధాన్యాన్ని అందించారు. కార్తెలు చదువుతున్న సమయంలో పూజలో ఉన్న ఎద్దు నెమరు వేస్తూ మూత్రం, కాని పేడ గాని విసర్జిస్తే ఆ కార్తెలో వర్షాలు కురుస్తాయని నమ్మకం. త్వరలోనే వర్షాలు కురుస్తాయని పండితులు తెలిపారు.

రైతులకు నివాళులు

గుంతకల్లుటౌన్/గుత్తి/తాడిపత్రి అర్బన్: నాటి టీడీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని బషీర్‌బాగ్‌లో చేసిన పోరాటంలో అమరులైన రైతులకు సీపీఎం నాయకులు నివాళులర్పించారు. సోమవారం గుంతకల్లు, గుత్తి, తాడిపత్రిలో పోలీస్ కాల్పుల్లో మరణించిన రైతులకు జోహార్లు అర్పించారు.

ఎస్టీఐ వేధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు


స్పందనలో ఫిర్యాదు చేస్తున్న కండక్టర్ నాగేంద్ర

గుత్తి: గుత్తి ఆర్టీసీ డిపో ఎస్టీఐ (సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్) తనను మానసికంగా వేదిస్తున్నారని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కండక్టర్ నాగేంద్ర ఫిర్యాదు చేశారు. లీవ్ అడిగితే నిరాకరించడం, చులకనగా మాట్లాడటం చేస్తున్నారని తెలిపారు. డ్యూటీకి వెళ్లినా కూడా ఆబ్సెంట్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని వినతి ప్రతం అందజేశారు. ఎస్టీఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

పాదయాత్రకు నీరాజనం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పూలమాలలతో స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- మండలంలో ముగిసిన ప్రజాసంక్షేమ పాదయాత్ర
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు


పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


ప్రజా సంక్షేమ పాదయాత్రకు తరలివచ్చిన నాయకులు, అభిమానులు

యాడికి: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పాదయాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. సోమవారం పెద్దపేట గ్రామంలో సంజీవరాయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం యాత్ర పెత్తపేట గ్రామంలో వీధుల్లో సాగుతుంటే ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రజా సంక్షేమ పాదయాత్ర పెద్దపేట నుంచి యాడికి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేపై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని వెల్లడించారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి యాడికి మండలం గుడిపాడు గ్రామంలో ప్రారంభమైన ప్రజా సంక్షేమ పాదయాత్ర కుందనకోట, చింతలాయపల్లె, బోయరెడ్డిపల్లె, చిక్కేపల్లె, నిట్టూరు, తిరునాంపల్లె, తిప్పారెడ్డిపల్లె, కొట్టాలపల్లె, వేములపాడు, నగరూరు, బోగాలకట్ట, తూట్రాళ్లపల్లె, రామారాజుపల్లె, కూర్మాజాపేట, రాయలచెరువు, చందన, పెద్దపేట మీదుగా సాగింది. సోమవారం యాడికి మండలానికి చేరుకుంది. గ్రామాల్లో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. పాదయాత్రలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ పాల్గొని, ఎమ్మెల్యేతో కలసి నడిచారు. అనంతరం పాదయాత్ర కోన రోడ్డులో నుంచి చెన్నకేశవ స్వామి దేవాలయం మీదుగా వైఎస్సార్ సర్కిల్ ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్దకు చేరుకుంది. బహిరంగ సభకు వచ్చిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, సర్పంచులు అనురాధ, సంజీవరాయుడు, పద్మనాభరెడ్డి, తలారి అరుణ, వైస్ ఎంపీపీలు హసీనా బేగం, చెన్నప్ప, తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్ చైర్మన్లు హరినాథ రెడ్డి, ఓబుళరెడ్డి, ఉప సర్పంచులు కాసా చంద్రమోహన్, శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీలు రామాంజనమ్మ, వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, శ్రీరాములు, నాయకులు కొట్టే వెంకటరామిరెడ్డి, కోనా వెంకటశివారెడ్డి, కోనా జగదీశ్వర రెడ్డి, నాగేష్, రషీద్ ఉపేంద్రగౌడ్, శివకేశవ రెడ్డి, శాతంతారెడ్డి, వెంకటరామిరెడ్డి, నిట్టూరు రామాంజనేయులు, మారుతి, రామకృష్ణ, హనుమంత రెడ్డి, మీసీ మల్లికార్జున పాల్గొన్నారు.

అందరికీ కృతజ్ఞతలు

యాడికి మండలంలో నాలుగో విడత చేపట్టిన ప్రజా సంక్షేమ పాదయాత్ర విజయవంతం కావడంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంఘీభావం తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్ర ముగింపు సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు.

జేవీవీ మండల కమిటీ ఎంపిక

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సోమవారం జేవీవీ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ విశిష్ట గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ రంగన్న, గౌరవాధ్యక్షులుగా కుళ్లాయి బాబు, దేశాయి నాగరాజు, వెంకటేశ్వర రెడ్డి, శ్రీధర్ గౌడ్, గౌరవ సలహాదారులుగా రంగనాథ్, పెన్నోబులేసు, అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా కాశీరావు, పెద్దిరెడ్డి, నిజాముద్దీన్, రమేష్, హనుమన్న, ప్రధాన కార్యదర్శిగా వెంకటరామి రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కేశవ, రాందాసు, వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, దాదా ఖలందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'స్పందన'కు రెండు వినతులు

పుట్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు అందినట్లు తహసీల్దార్ మోహన్ కుమార్ తెలిపారు. రీ సర్వేలో రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, భూ హద్దులు చూపించాలని సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే పుట్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు.

యల్లనూరు: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందని తహసీల్దార్ సుమతి అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆరు వినతులు వచ్చాయన్నారు. భూమి వివరాల ఆన్‌లైన్ నమోదుకు రెండు, భూమి సర్వేకు ఒక్కటి, పైపు లైన్ మరమ్మతుల కోసం ఒక్కటి, మరణ ధ్రువీకరణ కోసం ఒక్కటి, వెంకటాద్రిపల్లి గ్రామ సమస్యపై ఒకటి చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు.

పామిడి: పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి

జగనన్న మళ్లీ సీఎం కావాలి

- మస్తాన్‌వలి స్వామికి చాదర్ సమర్పించిన ఎమ్మెల్యే వైవీఆర్


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: జగనన్న మళ్లీ సీఎం కావాలని హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి స్వామికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చాదర్ సమర్పించారు. సోమవారం దర్గా బయటి నుంచి ఊరేగింపుగా వచ్చి మస్తాన్‌వలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. పట్టణ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్, ఇతర మతపెద్దలు ఎమ్మెల్యే వైవీఆర్‌కు ఆశీర్వచనం చేశారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటల ద్వారా అన్నదాతలకు సిరులు కురిపించాలని వేడుకున్నారు. సంక్షేమ రథసారధి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలవాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, వైస్ చైర్‌పర్సన్ సిబి.నైరుతిరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్ బాషా, కౌన్సిలర్లు జేసీబీ చాంద్‌బాషా, సుమో బాషా, కో–ఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌ఛార్జ్‌లు పీఎస్.మస్తాన్, యూనస్, వీరేష్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, సచివాలయ కన్వీనర్ ఎండీ ఖలీల్, ఈద్గా ఫంక్షన్ హాల్ చైర్మన్ ఎంబీ.మౌలా, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వైవీఆర్‌కు సత్కారం

పామిడి: గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డిని పామిడికి చెందిన భావసార క్షత్రియులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్‌తో పాటు పార్టీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకి రామిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కె.నారాయణరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు జోజోడే కుమార్, శ్రీనివాసరావు, ముకుంద, రఘు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


వాల్మీకి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

గార్లదిన్నె: వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని, ఆయన్ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మర్తాడులో వాల్మీకి విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు హాజరైన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు చేయించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని చాటి చెప్పిన వాల్మీకి జీవితం ఎంతో గొప్పదన్నారు. రామాయణం వంటి సుందరమైన కావ్యాన్ని రచించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వాల్మీకులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ ఎర్రమ్మ, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండమ్మ, నాయకులు ఓబుళపతి, సుబ్బు, కుళ్లాయప్ప, వివిధ గ్రామాల వాల్మీకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామ శివారులో శింగనమల మండలం, ఉల్లికల్లుకు చెందిన నాగార్జున (27) విషపు గుళికలు మింగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. నాగరాజు భార్య జ్యోతితో కుటుంబ సమస్యల కారణంగా తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. సోమవారం ఉదయం జ్యోతి వాస్మాల్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో భర్త నాగరాజు అనంతపురం వెళ్లలేదు. తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లి వద్దకు వచ్చి, వెంట తెచ్చుకున్న విషపు గుళికలను మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


వాటర్‌వర్క్స్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలో తాగునీటి సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ సిబ్బంది మస్టర్‌కు హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ మస్టర్‌కు తప్పకుండా హాజరు కావాలని, సమయపాలన పాటించాలన్నారు. ప్రజలు ఫోన్ చేస్తే సమాధానివ్వడం నేర్చుకోవాలని సూచించారు. వార్డుల్లో నీటిని వదిలినప్పుడు ఆయా కాలనీల్లోకి వెళ్లి నీటి సమస్యలపై ఆరా తీయాలని సూచించారు. నీరు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనధికార కుళాయిలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. అంతకుముందు కమిషనర్ మస్తాన్‌వలి దర్గా ఆవరణలో పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లను కళ్లతోనే బెదిరిస్తారా?

- ఉద్రిక్తంగా మారిన కౌన్సిల్ సమావేశం


మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని నిలదీస్తున్న కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

తాడిపత్రి: ప్రజల చేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లకు గౌరవం ఇవ్వాలని, అలా కాకుండా అంతా మీరే అన్నట్లు కళ్లతో బెదిరించడం మంచి పద్ధతి కాదని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ 31వ వార్డు కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి హితవు పలికారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిలర్ల సమావేశం ఉద్రిక్తంగా మారింది. అజెండాలో పేర్కొన్న 38 అంశాలను కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా వినిపించారు. 34వ అంశం మాత్రం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రాఘవేంద్ర డిసెంట్ పిటిషన్ ఇవ్వడంతో దానిని కలెక్టర్‌కు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని చైర్మన్ పేర్కొన్నారు. సమావేశం ప్రారంభంలో టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్లు సుమోటో పిటిషన్‌ను చైర్మన్‌కు అందజేశారు. పిటిషన్‌లో భాగంగా కౌన్సిలర్ రాబర్ట్‌ను 3 కౌన్సిల్ సమావేశాలకు హాజరుకాకుండా సస్పెన్షన్ విధించాలని డిమాండ్ చేశారు. వెంటనే కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కలగజేసుకుని.. కౌన్సిలర్ చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున టీడీపీ కౌన్సిలర్లు రెచ్చిపోయి, వాగ్వాదానికి దిగారు. రెండు పార్టీలకు చెందిన కౌన్సిలర్లు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినా మెజార్టీ కౌన్సిలర్ల సభ్యుల ఆమోదంతో కౌన్సిలర్ రాబర్ట్‌పై 3 సమావేశాలకు సస్పెన్షన్ విధించారు. పోలీసుల జోక్యంతో సమావేశం సజావుగా సాగేందుకు మార్గం సుగమం కావడంతో ఇతర అంశాలపై తీర్మానాలు ఆమోదించబడ్డాయి. అజెండాలోని 11 అంశమైన అమృత్ 2.0 యూఎల్‌బీ షేర్ చెల్లింపు, ఇతర విధివిధానాలపై 31 వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతుండగానే తెదేపా కౌన్సిలర్ ఇదే అంశానికి సంబంధించి మాట్లాడేందుకు ప్రయత్నించగా మున్సిపల్ చైర్మన్ రేయ్ అంటూ గద్దించారు. దీంతో సదరు కౌన్సిలర్ మిన్నకుండిపోయారు. కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అందరినీ కళ్లతో ఉరిమి ఉరిమి చూసి, బెదిరించడం మీకు అలవాటు కదా అని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదని, మాట్లాడే అవకాశం అందరికీ ఇవ్వాలని సూచించారు. టీడీపీకి రాజీనామా చేసిన విషయాన్ని జీర్ణించుకోలేని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆ పార్టీ కౌన్సిలర్లు కక్ష పూరితంగానే తనపై సుమోటో పిటీషన్ వేసి, సస్పెన్షన్ విధించారని కౌన్సిలర్ రాబర్ట్ ఆరోపించారు.

31న మిశ్రమ బియ్యం సేకరణకు వేలం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యం సేకరణకు ఈనెల 31న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు సోమవారం తెలిపారు. వేలం పాట ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.1000 డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని ఈఓ సూచించారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


శివయ్య (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివయ్య (54) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో నివాసం ఉండే శివయ్య సోమవారం వేకువజామున నాలుగున్నర గంటల సమయంలో నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు నడిచి వెళ్తూ కుప్పకూలారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హెచ్‌ఎం శివయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు హెచ్‌ఎం శివయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జగనన్న విద్యా దీవెనతో విద్యార్థులకు లబ్ధి


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

శింగనమల: జగనన్న విద్యా దీవెన పథకంలో పేద విద్యార్థులకు భరోసా లభిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ నాయక్ అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా నగరిలో బటన్ నొక్కి విద్యా దీవెన సొమ్మును తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా శింగనమల రామాలయంలో సీఎం జగనన్న చిత్రపటానికి స్థానిక నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ నాయక్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునేందుకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు ఆర్థికంగా బలోపేతం చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో వెస్ట్ నరసాపురం సర్పంచ్ వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటరమణ, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, మండల యూత్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, నాయకులు మంత్రిగారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫారం పాండ్ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి రూరల్: గుత్తి డివిజన్ పరిధిలోని ఉద్యాన రైతులు ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పథకాల ద్వారా ప్యాక్‌హౌస్, ఫారంపాండ్‌లు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉద్యానశాఖ అధికారిణి మిత్రవింద మాధవి తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం వాటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

'స్థలం కబ్జా చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా'


మాట్లాడుతున్న సర్పంచ్ గురుమస్తాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ పరిధిలో తాను లేదా తన కుటుంబ సభ్యులు సెంటు స్థలం కబ్జా చేసినట్లు టీడీపీ నాయకుడు జీవానందరెడ్డి నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామ చేస్తానని కొత్తపేట సర్పంచ్ గురుమస్తాన్ స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకుడు జీవానందరెడ్డి కొత్తపేట పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో పర్యటించి బోర్లు వేయలేదని విద్యుత్ సౌకర్యం కల్పించలేదని అసత్య ప్రచారం చేశారన్నారు. లేఅవుట్‌లో నాలుగు బోర్లు వేయగా.. ఒక్క బోరులో మాత్రమే నీరు పడినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని త్వరలోనే విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల అడదండలతో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసానని చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. టీడీపీ నాయకుడు జీవానందరెడ్డిలా తాను దొంగనోట్లు మార్పిడి, స్మగ్లింగ్, హైదరాబాద్‌లో దొంగ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసి రూ.వేల కోట్లు సంపాదించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సర్పంచ్ అయిన తనపై అసత్య ఆరోపణలు చేసిన జీవానందరెడ్డిపై పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాము యాదవ్, ఉప సర్పంచ్ రాముఆచారి, నాయకులు వెంకట్రాముడు, సుధాకర్, అబ్దుల్ వాహబ్, హాజీవలి, చిన్నమస్తాన్, సురేష్, వేణుకుమార్, నరేష్, బసప్ప, శ్రీరాములు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

తాడిపత్రి: రోడ్డు ప్రమాదంలో లక్ష్మీదేవి అనే మహిళకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో తాడిపత్రి–కడప ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. ధర్మవరానికి చెందిన లక్ష్మీదేవి తాడిపత్రిలో జరుగుతున్న ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు తాడిపత్రిలోని వారి బంధువుల ఇంటికి సోమవారం ఉదయం వచ్చింది. వారంతా కలసి వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళుతున్న సమయంలో రహదారి పక్కగా నడుస్తున్న ఆమెను కడప వైపుకు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీదేవి కుడి కాలిపై లారీ టైర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న రూరల్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతయ్య, సిబ్బందితో కలసి లక్ష్మీదేవిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐచర్, ప్రైవేట్ బస్సు ఢీ

యాడికి: మండలంలోని వేములపాడు గ్రామ సమీపంలో సోమవారం ఐచర్, ప్రైవేట్ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు.. సోమవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ బస్సు హైదరాబాద్ నుంచి పులివెందులకు వెళ్తోంది. ఐచర్ వాహనం బద్వేలు నుంచి గుత్తి వైపునకు వెళ్తుండగా.. వేములపాడు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రైవేటు బస్సు పాక్షికంగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదని ఎస్ఐ తెలిపారు.